క్లుప్తంగా

అనుబంధ విభాగాల అధ్యక్షులకు అభినందనలు



అధ్యక్షులను సన్మానిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాలైన జిల్లా రైతు విభాగం, వైఎస్సార్‌టీయూసీ, పంచాయతీరాజ్‌వింగ్ అధ్యక్షులుగా నియమితులైన గొర్లె అప్పలనాయుడు, లంకలపల్లి ప్రసాద్, నేతింటి నీలమప్పుడులకు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అభినందించారు. శనివారం రణస్థలంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయం వద్ద సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటరమేష్‌కు ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న వెంకటరమేష్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్స్ అడ్వైజర్ ప్రొఫెసర్ పి.వెంకటరమేష్ శనివారం జరిగిన ఆసియా టుడే సంస్థ ద్వారా ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ హానర్బల్ విష్ణుదేవ్ వర్మ ఈ అవార్డును ప్రదానం చేశారు.

పన్ను చెల్లించకపోతే భవనాలు సీజ్



షాపును సీజ్ చేస్తున్న అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో దీర్ఘకాలంగా పన్ను బకాయి ఉంటే భవనాలను సీజ్ చేస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేష్‌బాబు అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని చిత్తరంజన్ వీధిలో రామకృష్ణ అనే వ్యక్తి ఆస్తి పన్ను రూ 3,05,174 చెల్లించనందున సంబంధిత షాపును సీజ్ చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వీనులవిందుగా 'సుస్వర లహరి'



కీబోర్డు వాయిస్తున్న చిన్నారి శౌర్యశర్మ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆరోహి సంగీత కళాశాల ఆధ్వర్యంలో పెంకి నాగేశ్వరరావు నిర్వహణలో శనివారం నిర్వహించి 'సుస్వర లహరి' కార్యక్రమం వీనుల విందుగా సాగింది. పలు కీర్తనలు, పసందైన సినీ గీతాలతో గాయకులు అలరించారు. అరసవల్లి ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ కుమారుడు ఇప్పిలి శౌర్యశర్మ అతి చిన్నవయసులోనే కీబోర్డుతో చక్కటి ప్రదర్శన కనబరిచాడు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, డాక్టర్ కె.అమ్మన్నాయుడు, ఇప్పిలి శంకరశర్మ, డాక్టర్ కణుగుల సుధీర్, గుమ్మా నగేష్, సభా నిర్వాహకులు ఎం.వి.కామేశ్వరరావు, జి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

28న ఘంటసాల జయంతి ఉత్సవం

శ్రీకాకుళం కల్చరల్: జి.బి.ఎ.స్వరమాధురి ఆధ్వర్యంలో ఈ నెల 28న బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల వేంకటేశ్వరరావు 102వ జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిక్కు అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. బి.ఎ.నారాయణచే ఘంటసాల గానామృత లహరి కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రాజశేఖర్

ఎచ్చెర్ల: లావేరు మండల సచివాలయం ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా వెల్ఫేర్ అసిస్టెంట్ బలివాడ రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా తాలాడ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కెల్ల జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్మారావు, కోశాధికారిగా టి.గౌరీశంకర్ ఎన్నికయ్యారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: నగరప్పాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల ఆదినారాయణ తండ్రి మాలచ్చి శనివారం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరిమజ్జి రమణ, మాజీ సర్పంచ్ కరిమజ్జి భాస్కరరావ పాల్గొన్నారు.

మార్కెట్‌కు క్రిస్మస్ జోష్



పురిపాకలో క్రీస్తు జననం తెలియజేసే సెట్

- జోరుగా అలంకరణ వస్తువుల విక్రయం
- శాంతాక్లజ్ డ్రెస్సులు, విద్యుత్ నక్షత్రాలకు గిరాకీ

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. సెమీక్రిస్మస్, స్ట్రీట్ క్రిస్మస్, సండే క్రిస్మస్ పేరిట ముందస్తు వేడుకలను క్రైస్తవులు ఆనందంగా జరుపుకొంటున్నారు. ఇప్పటికే చర్చిలన్నీ విద్యుద్దీపాల వెలుగులతో ధగధగా మెరిసిపోతున్నాయి. క్రీస్తు ఆరాధకుల నివాసాలు కూడా క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలు, ఇతర ప్రత్యేక సామగ్రితో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి.

అలంకరణపై దృష్టి..

నగరంలో పది రోజుల ముందుగానే క్రిస్మస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవ సోదరులంతా చర్చిలను, తమ ఇళ్లను ఇప్పటికే ప్రత్యేకంగా అలంకరించారు. క్రిస్మకు సంబంధించిన సామగ్రికి మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. పలు స్కూళ్లలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిపేందుకు సిద్ధపడుతున్నారు. ఈ సందర్భంగా పిల్లలతో క్రిస్మస్ తాత(శాంతాక్లజ్) వేషాలు వేయించేందుకు ప్రత్యేక డ్రెస్సులను కొనుగోలు చేస్తున్నారు.



నక్షత్రాలు

వీటికే డిమాండ్..

మార్కెట్‌లో విద్యుత్‌ట్రీ, శాంతాక్లాజ్ డ్రస్సులు, విద్యుత్ నక్షత్రాలు, బాల్స్, క్రీస్తు జననం తెలిపే బొమ్మలకు మంచి గిరాకీ ఉంది. వీటి ధరలు రూ.30 నుంచి రూ.10వేల వరకు ఉన్నాయి. నక్షత్రాలు రూ.30 నుంచి రూ.3వేలు వరకు ధర పలుకుతున్నాయి. అలంకరణ ట్రీలు రూ.10వేలుగాను, సాధారణ ట్రీలను రూ.2వేలు వరకు విక్రయిస్తున్నారు. శాంతాక్లాజ్ డ్రెస్సులు కూడా చిన్నపిల్లల సైజు నుంచి పెద్దవాళ్ల సైజు వరకు రూ.300 నుంచి రూ.3వేలు వరకు ధరకు అమ్ముతున్నాయి. అన్ని వస్తువులు కలిసి ఉన్న సెట్ రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. శాంతాక్లాజ్ బొమ్మ సైజును బట్టి రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ధర పలుకుతోంది.



క్రిస్మస్ ట్రీ



క్రిస్మస్ ట్రీ అలంకరణ సామగ్రి



చిన్నారుల శాంతాక్లజ్ డ్రెస్సు



అలంకరణ వస్తువులు

విక్రయాలు బాగున్నాయి..



మార్కెట్‌లో క్రిస్మస్ పండగకు సంబంధించిన అలంకరణ సామగ్రికి డిమాండ్ ఉంటోంది. ఇళ్లు, చర్చిల వద్ద అలంకరించేందుకు అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది విక్రయాలు కూడా బాగున్నాయి.

– సోమేశ్వరరావు, విక్రయదారుడు, పెట్రోమాక్స్ వీధి

సేవలకు సత్కారం



ధ్యానంతో ఆరోగ్యం, ఏకాగ్రత సాధ్యమవుతుందని రాజీవ్ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అన్నారు. క్యాంపస్‌లో యోగా విభాగం ఆధ్వర్యంలో ధ్యాన దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలన్నారు. అనంతరం యోగా శిక్షకులు కె.శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్‌ఆఫ్ అకాడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, డీన్ ఆఫ్ వెల్ఫేర్ రవి, అధికారులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వెంకన్నకు విశేష అలంకరణ



నగరంలోని మొండేటివీధి, నారాయణ తిరుమల, పాతశ్రీకాకుళం, డీసీసీబీ కాలనీల్లోని వేంకటేశ్వర దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

నిరాశ్రయులకు అండగా..



వర్షాకాలంలో నిరాశ్రయులుగా ఉంటూ చలికి ఇబ్బందులు పడుతున్న పలువురికి అరసవల్లికి చెందిన డాక్టర్ ఇంజరాపు మోహనరావు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. బస్టాండ్, దేవాలయాలు, ఆస్పత్రులు, మండపాల బయట ఉంటున్న సుమారు 100 మందికి వీటిని అందజేశారు. కార్యక్రమకంలో బత్తిలి రమేష్, నవచైతన్య, జాడ సాయి, నంది ఉమాశంకర్, పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

తడిచిన వరి పంట పరిశీలన



రణస్థలం:కమ్మసిగడాంలో వరి కుప్పలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు



గార: కొర్లాం వద్ద నీటిలోనే వాలిపోయిన వరి చేను

రణస్థలం: కోత కోసిన వరి పనలపై కళ్లు ఉప్పు ఎకరాకి 25 కేజీ జల్లాలని, గింజలు మొలకట్టకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణం (లీటర్ నీటికి 50 గ్రాముల కళ్లు ఉప్పు)ని పిచికారీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాధరావు, రాగోలు శాస్త్రవేత్త ఉదయబాబు రైతులకు సూచించారు. రణస్థలం మండలం కమ్మసిగడాం, కొండములగాం, వేల్పురాయి పంచాయతీల్లో తడిచిన వరి పంటను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగు మారిన ధాన్యం కొంటామని, ఒక్క రైతూ నష్టపోకుండా ధాన్యం కొనుగోలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి డి.విజయభాస్కర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి..

గార: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని తహశీల్దార్ సనపల రమణరావును సర్పంచ్ పీస శ్రీహరిరావు, రైతులు కోరారు. శనివారం కొర్లాం, కుమ్మరిపేట తదితర శివారు ప్రాంతాల్లో నేల వాలిన వరి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. వంద ఎకరాల్లో కోసిన వరి చేను ఉండగా, నేలవాలిన పంట కూడా నీటిలో ఉండిపోవడంతో ధాన్యం రంగు మారి పిండి అయ్యే పరిస్థితి ఉందన్నారు. నష్ట తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని కోరారు.



జి.సిగడాం: ముషినివలసలో వరి పనలను పరిశీలిస్తున్న అధికారులు

1400 ఎకరాల్లో పెసర పంటకు నష్టం

గార: శ్రీకూర్మం పంచాయతీలో తండ్యాలపేట, జల్లపేట, ముద్దాడపేట, అంపోలు పరిధిలోని లింగాలవలస, చల్లపేట తదితర ప్రాంతాల్లో సుమారు 1400 ఎకరాల్లో పెసర సాగుకు నష్టం వాటిల్లింది. గింజలు నాని మొలకలు వస్తున్నాయి. పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఏవో డి.పద్మావతి తెలిపారు.

జి.సిగడాం: వర్షాల కారణంగా ముంపునకు గురైన వరి పంటను జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ త్రినాథస్వామి, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఏట వై.శారద పరిశీలించారు. పంటను గట్లపైకి తీసుకొచ్చి ఆరబెట్టాలని రైతులకు సూచించారు.

రణస్థలం: రణస్థలం, లావేరు మండలాల్లోని వందలాది ఎకరాల్లో వరి పనలు, కుప్పలు నీటి మునిగిపోయాయి. తడిసిన ధాన్యం రంగు మారే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధ్యానంతో ప్రశాంతత



ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ధ్యాన దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: ధ్యానంతో ఒత్తిడి నుంచి విముక్తి కలిగి ప్రశాంతత లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థలు, కార్యాలయాల వద్ద ధ్యానంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అధికారులు, నాయకులు, బోధకులు పాల్గొని ధ్యానం ఆవశ్యకతను వివరించారు. ధ్యాన కేంద్రాల నిర్వాహకులు, అభ్యాసకులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి సాయం



రణస్థలం : సంచాం, పైడి భీమవరం గ్రామాల మధ్య అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన వినోద్, తోటి స్నేహితులతో కలిసి సేకరించిన రూ.లక్షా 85వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆలయ ధర్మకర్త ఆకెళ్ల ఫణిశర్మకు గ్రామ పెద్దల సమక్షంలో శనివారం ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కార్తీక్, గ్రామ పెద్దలు కోరాడ వెంకటరమణ, రాంబాబు, రౌతు శ్రీనివాసరావు, హోటల్ ప్రసాద్, వద్దాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు తప్పనిసరి



విద్యార్థులు ప్రదర్శించిన స్మార్ట్ హోం ప్రాజెక్టు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో శనివారం ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ జి.టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగం పెరగాలన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

1న పౌరాణిక నాటక పోటీలు

రణస్థలం: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జనవరి 1న కోష్ట పంచాయతీలో పౌరాణిక నాటక పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని, వివరాలకు 94407 58557, 98668 06835 నంబర్లను సంప్రదించాలని కోరారు.

28న మండల సర్వసభ్య సమావేశం

ఎచ్చెర్ల : లావేరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీఓ పి.వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జి.టి.రోడ్డులో ఉన్న జామియా మసీదులో రెడ్‌క్రాస్ సహకారంతో ఆల్ ఇండియా మానవత్వ సందేశ సమితి ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జామియా మసీదు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం సోదరులు,అభిమానులు పాల్గొనాలని కోరారు.

కూర్మనాథున్ని దర్శించుకున్న ఐఆర్ఎస్ అధికారి

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలో కూర్మనాథున్ని బెంగళూరు ఐఆర్ఎస్ అధికారి యామిని కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్రమహత్యాన్ని వివరించారు. ఈవో జి.గురునాథంస్వామి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

జనం మెచ్చిన నాయకుడు జగన్



రణస్థలం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ శ్రేణులు

- చంద్రబాబు బూటకపు హామీలు నమ్మి జనం మోసపోయారు
- వైఎస్ జగనమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జనం మెచ్చిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శ్రీకాకుళం నగరంలో రామలక్ష్మణ కూడలి వద్ద దుర్గమ్మవారి ఆలయంలో తెన్నేటి సునీల్‌శర్మ ఆధ్వర్యంలో మహాయాగం చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీశ్రేణులకు పంచిపెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి (రిమ్స్)లో రోగులకు పండ్లు పంపిణీ, ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నిండునూరేళ్లు ఇలాంటి పుట్టిన రోజులు జరుపుకొని ప్రజలకు మంచిపాలన అందించాలని ఆకాంక్షించారు. ఎన్నికల ముందు చంద్రబాబు అబద్ధపు హామీలివ్వడంతో నమ్మి ఓటేసిన ప్రజలకు మోసగించారని, రాష్ట్ర ప్రజలంతా కూటమి పాలనపై మండిపడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి ప్రజలకు సంక్షేమాన్ని అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, తూర్పుకాపు, కళింగవైశ్య కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, ఎం.వి.స్వరూప్, డాక్టర్ చింతాడ వరుణ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, మండల నాయకులు అంబటి శ్రీనివాస్, గొండు రఘురాం, వై.వి.శ్రీధర్, ఎన్ని ధనుంజయరావు, పొన్నాడ రుషి, మండవల్లి రవి, మూకళ్ల తాత బాబు, చిట్టి జనార్దనరావు, గేదెల పురుషోత్తం, డి.పి.దేవ్, టి.కామేశ్వరి, గుంట జ్యోతి, పీస గోపి, మార్పు పృథ్వీరాజ్, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, తంగుడు నాగేశ్వరరావు, సీపాన రామారావు, వానపల్లి రమేష్, గుడ్ల దామోదరరావు, సిహెచ్. భాస్కరరావు, కనపల తేజ, రావాడ జోగినాయుడు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రక్తదానం మహాదానమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి. పద్మావతి అన్నారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఆబోతుల రామ్మోహన్ ఆధ్వర్యంలో వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం నిర్వహించారు. 32మంది యువకులు రక్తదానం చేశారు.



శ్రీకాకుళం రిమ్స్‌లో రోగికి రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జి.సిగడాం: బలిజి కల్యాణ మండలంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో జిల్లా పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షుడు నేతింటి నీలమప్పడు ఆధ్వర్యంలో వేడుకలు

రణస్థలం: జన హృదయాల్లో స్థిరమైన స్థానం సాధించి సంక్షేమ, అభివృద్ధి కాంతులు పూయించిన జనం మెచ్చిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం రణస్థలంలోని ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో వైఎస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు రణస్థలం ఎంపీపీ ప్రతినిధి, ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న పిన్నింటి సాయికుమార్



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జెమ్స్‌లో రక్తదానం. చిత్రంలో ఎంవీ పద్మావతి, ఆబోతుల రామ్మోహన్



జి.సిగడాం : రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న శ్రీరామమూర్తి, వడిశ మహేశ్వరరావు



ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత కొత్తకోట సూర్యారావు, యువకులు

స్కూల్ ప్రహరీ కూల్చేసి వాటర్ ట్యాంకు నిర్మాణం



ప్రహరీ పడగొట్టి వాటర్ ట్యాంకు నిర్మాణానికి గోతులు తీసిన దృశ్యం

గార: మండలంలోని బోరవానిపేట పంచాయతీ తాళ్లవలసలో కూటమి నాయకుల మద్దతుతో నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ ప్రహరీ కూల్చేసి వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఓ కాంట్రాక్టర్ సిద్ధమయ్యాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ట్యాంకు ఏర్పాటుకు సచివాలయ వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ముందస్తుగా స్థలాన్ని పరిశీలించి అనుమతి తెలియజేయాల్సి ఉన్నా అటువంటివేమీ జరగలేదు. పాఠశాల రోడ్డువైపు కొంత మేర ప్రహరీ తీసేసి , గోతులు తవ్వారు. అదే విధంగా, తోనంగి పంచాయతీ చినతోనంగి ప్రాథమిక పాఠశాల ఆవరణలో బేస్‌మెంట్ పనులు జరిగినా సమాచారం ఇవ్వాల్సిన ఉపాధ్యాయులు పట్టించుకోలేదు. వాస్తవానికి పాఠశాలల్లో జరిపే నిర్మాణాలకు ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. ఇవేమీ పట్టించుకోకుండా సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో నక్క రామకృష్ణ వద్ద ప్రస్తావించగా ఈ రెండు నిర్మాణాలపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు వాయిస్ మెసేజ్‌ను పంపించామని, ఇటువంటి పనులు ప్రారంభిస్తే ముందుగా వద్దని చెప్పాలని, తమకు సమాచారం అందించాలని తెలియజేసినట్లు పేర్కొన్నారు.